క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



చెత్తను తొలగిస్తున్న విద్యార్థులు

శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని మల్కారంలో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా మంగళవారం ఏవీ కళాశాల విద్యార్థులు గ్రామంలో చెత్తను తొలగించారు. రోడ్లు, వీధుల్లో చెత్తను ఊడ్చారు. స్థానికులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవీ యాదగిరిరెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: అభివృద్ధి పనులకు ప్రజల సహకారం అవసరమని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పనుల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైపులైన్‌లను ఏర్పాటు చేస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

దాడి కేసులో తండ్రి, కొడుకు రిమాండ్

రాజేంద్రనగర్: భార్యను వేధిస్తున్నాడని కుమారుడితో కలిసి యువకుడిపై దాడి చేసిన తండ్రి, కొడుకులను అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. లంగర్‌హౌజ్‌కు చెందిన నరహరిచారి(46), హరిప్రసాద్‌చారి(21) తండ్రి, కొడుకులు. నరహరిచారి మొదటి భార్య మృతి చెందడంతో కోస్గికి చెందిన యువతిని రెండో వివాహం చేసుకున్నాడు. కోస్గికి చెందిన రవి నరహరిచారి తరచు తన భార్యతో ఫోన్‌లో మాట్లాడేవాడు. నరహరిచారి లేని సమయంలో ఇంటికి వచ్చి వెళ్లే వాడు. సోమవారం సాయంత్రం అతను నరహరిచారి ఇంటికి వచ్చి తిరిగి వెళ్తుండగా నరహరిచారి, అతడి కుమారుడు హరిప్రసాద్‌చారి అతడిని వెంబడించి దాడి చేశారు. బాధితుడు రవి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

ప్రమాదవశాత్తు కిందపడి యువకుడి మృతి



సచిన్ మృతదేహం

రాజేంద్రనగర్: ప్రమాదవశాత్తు కిందపడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుద్వేల్ ప్రాంతానికి చెందిన సచిన్(25) చిత్తుకాగితాలు ఎరుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం అతను కాటేదాన్ రామ్‌చరణ్ ఆయిల్‌మిల్ ప్రాంతంలోని పుట్‌పాత్‌పై కాగితాలు ఎరుకుంటూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మసీదులకు కొత్త శోభ

గోల్కొండ: రంజాన్ మాసం సందర్భంగా మసీదులు కొత్త శోభను సంతరించుకున్నాయి. ప్రధాన మసీదులు, జామా మసీదులకు రంగులు వేసి విద్యుత్ దీపాలు అమర్చారు. ప్రార్థనలకు వచ్చేవారి కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. టోలిచౌకిలోని బిలాల్ మసీదు, గోల్కొండ కోటలోని ప్రాచీన కుతుబ్‌షాహీ జామా మసీదు, మెహిదీపట్నం చౌరస్తా జామా మసీదు తదితర మసీదులను సుందరంగా అలంకరించారు.

హెచ్‌ఎండీఏ భూముల్లో అక్రమార్కుల పాగా

- 1990 నుంచి 2011 వరకు రైతులకు పరిహారం చెల్లించి భూమిని సేకరించిన హెచ్‌ఎండీఏ
- 183 ఎకరాల సేకరణ
- ఖాళీగా ఉన్న స్థలాల్లో అక్రమంగా షెడ్ల నిర్మాణం
- సర్వేకోసం వచ్చిన అధికారులపై రాళ్లదాడి
- ఇంటినంబర్లు, రిజిస్ట్రేషన్లపై ఆరా..



హెచ్‌ఎండీఏ అధికారులు కూల్చివేసిన షెడ్లు

శంషాబాద్: వందల కోట్ల రూపాయల విలువ చేసే హెచ్‌ఎండీఏ భూములపై అక్రమార్కుల కన్నుపడింది. గత కొంత కాలంగా కొందరు వ్యక్తులు ఆయా స్థలాలు తమకు చెందినవిగా పేర్కొంటూ అక్రమ నిర్మాణాలు చేపట్టారు. స్థానికుల ఫిర్యాదుతో అప్రమత్తమైన హెచ్‌ఎండీఏ అధికారులు పరిరక్షణ చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే..పట్టణంలోని సర్వే నంబరు 720 నుంచి 730 వరకు ఉన్న వివిధ సర్వే నంబర్లలో హెచ్‌ఎండీఏ 183 ఎకరాల భూమిని 1990లో రైతుల నుంచి సేకరించింది. 2011లో పలు దఫాలుగా వారికి పూర్తి పరిహారం సైతం చెల్లించి స్వాధీనం చేసుకుంది. సదరు స్థలాల్లో హెచ్‌ఎండీఏ నర్సరీలు, పార్కు స్థలాలు పోగా కొన్ని చోట్ల ఖాళీ స్థలాలున్నాయి. ఆయా స్థలాలను గతంలో ప్రభుత్వం ట్రక్ పార్కుకు కేటాయించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం కొన్ని రూ. వందల కోట్ల విలువైన ఈ స్థలాలకు వారసులమంటూ కొందరు వ్యక్తులు ఆక్రమణలు చేపట్టారు. ప్రహరీల నిర్మాణం చేపట్టడమేగాక, కొన్ని ప్రాంతాల్లో ఏకంగా గదులను నిర్మించి, వాచ్‌మెన్ లను కాపలాగా పెట్టారు. గతంలో స్థలాలను అప్పగించిన రైతులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

అధికారులపై రాళ్ల దాడి..

హెచ్‌ఎండీఏ తమ స్థలాలను పరిరక్షించుకునే చర్యల్లో భాగంగా వారం రోజుల క్రితం ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులను కాపలాగా ఉంచింది. తాజాగా స్థలాలను సర్వే చేయడంతో పాటు, అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు వచ్చిన అధికారులు, సిబ్బందిపై అక్రమార్కులు రాళ్లతో దాడి చేశారు. హెచ్‌ఎండీఏ అధికారులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అక్రమ నిర్మాణాలు.. ఇంటి నంబర్లు..

హెచ్‌ఎండీఏ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన ఇళ్లకు మున్సిపాలిటీ అధికారులు ఇంటినెంబర్లు సైతం ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఇంటి నంబర్ల ఆధారంగా అక్రమార్కులు జనవరి, ఫిబ్రవరి మాసాల్లో మొత్తం 10కి పైగా స్థలాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి శారు. ఈ విషయం కూడా ప్రస్తుతం వెలుగులోకి రావడంతో అధికారులు మున్సిపాలిటీ అధికారులతో పాటు రిజిస్ట్రేషన్ అధికారుల నుంచి వివరాలు సేకరించే పనిలో పడ్డారు.

మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలి

రాజేంద్రనగర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర యువమోర్చా అధ్యక్షులు బైతి శ్రీధర్ అన్నారు. పేపర్ లీకేజీపై టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు భానుప్రకాష్‌పై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ఆరాంఘర్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. యువమోర్చా రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ సురెడ్డి వినయ్‌రెడ్డి అధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బైతి శ్రీధర్ మాట్లాడుతూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న వారిని వదిలేసి న్యాయం కోసం పోరాడుతున్న బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు, కార్యకర్తలను అరెస్టు చేయడం దారుణమన్నారు. అరెస్టులు, జైళ్లు తమకు కొత్తకాదని నమ్మిన సిద్ధాంతం కోసం, ప్రజల పక్షాన పోరాడతామని స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రాల కేజీతో లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలు ప్రమాదంలో పడ్డాయన్నారు. . తక్షణమే బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు భానుప్రకాష్‌ను, కార్యకర్తలను బేషరతుగా విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. లీకేజీపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, బొక్క బాల్‌రెడ్డి, బీజేపీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, కార్పొ రేటర్లు ప్రశాంత్‌నాయక్, భూపాల్‌గౌడ్, కిరణ్‌చారి, ఎస్.వెంకటేష్, ప్రవీణ్, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.



టీఎస్‌పీఎస్సీ కమిషన్‌ను రద్దు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదిరాల రవికుమార్ తదితరులు

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ బాధ్యతా రాహిత్యం, చైర్మన్, సభ్యుల నిర్లక్ష్యం కారణంగా ఎందరో నిరుద్యోగుల భవిష్యత్తు అంధకారంలో పడిందని బహుజన్ సమాజ్ పార్టీ రాజేంద్రనగర్ సర్కిల్ అధ్యక్షులు ఆదిరాల రవికుమార్ అన్నారు. కమిషన్‌ను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం రాజేంద్రనగర్ తహసీల్దార్‌కు బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్, సభ్యులందరినీ పదవుల నుంచి తొలగించి కొత్త కమిషన్‌ను ఏర్పాటు చేసి 30 లక్షల మంది నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ఆరు నెలలుగా టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన 12 రకాల పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని సిట్ విచారణను నిలుపుదల చేసి, సీబీఐ విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సభావత్ గోవిందనాయక్, సబావత్ రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మణికొండ: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని, వాటిని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్ గ్రామానికి చెందిన సుజాతకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 60వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పింఛన్లు, రైతు బంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్ మెంట్, మహిళా రుణాలు, దళిత బంధు తదితర పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆర్. నర్సింహ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మణెమ్మ తదితరులు

బండ్లగూడ: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణెమ్మ అన్నారు. మంగళవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్‌లో పోషణ పక్షం ఉత్సవాలను నిర్వహించారు. డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మణెమ్మ, అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలు, ఆకు కూరలు తినడం వల్ల రక్తహీనతను నివారించవచ్చునన్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి రోజూ గుడ్డు తినాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మహనీయుల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

రాజేంద్రనగర్: మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవ నూతన కమిటీ అధ్యక్షులు ముద్దగోని మల్లికార్జున్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పిట్టల శివముదిరాజ్ ఆధ్వర్యంలో సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏప్రిల్ 11న మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యేను పరిచయం చేసుకుని ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. అందుకు సహాయసహకారాలు అందించేందుకు తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానన్నారు. మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను చేసేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కె.కృష్ణమాచారి, డి.సత్యనారాయణ, రాపోలు సత్తయ్య, బంగి శ్రీను, కె.రఘుగౌడ్, కె.యాదయ్యముదిరాజ్, జి.దయానంద్‌గౌడ్, రఘుముదిరాజ్, పి.భిక్షపతి, బిట్కూరి సిద్దేశ్వర్, కిరణ్‌చారి, వేముల రమేష్, టి.శ్రీశైలం, కాశీగారి యాదగిరి, యు.విజయ్‌కుమార్, కె.సత్యనారాయణగౌడ్, రఘుయాదవ్, ఏ.సురేష్, పులిజాల శ్రీను, ఎల్.వెంకటేష్, సలెశ్వర్, పి.శేఖర్, బోయి రమేష్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న చేవెళ్ల పార్లమెంట్ బూత్ సశక్తికరణ అభియాన్ ఇన్‌చార్జి అరుణ్‌కుమార్

రాజేంద్రనగర్: భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని చేవెళ్ల పార్లమెంట్ బూత్ సశక్తికరణ అభియాన్ ఇన్‌చార్జి అరుణ్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజన్‌కుమార్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ అసెంబ్లీ బూత్ సశక్తికరణ అభియాన్ ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. మహవీర్ ఇంజనీరింగ్ కళాశాలలో రాజేంద్రనగర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్‌యాదవ్, జాయింట్ కన్వీనర్ మహాలింగం గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అరుణ్‌కుమార్, అంజన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ బూత్ సశక్తికరణ అభియాన్ ఇన్‌చార్జిలు పార్టీని మరింత ముందుకు తీసుకువెళ్లాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడమే కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలన్నారు. పార్టీ బూత్‌స్థాయి నుంచి బలోపేతమైనప్పుడే పటిష్టంగా ఉంటుందన్నారు. అందుకు అందరిరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిప్రసాద్, మల్లారెడ్డి, బుక్క వేణుగోపాల్, కొమురయ్య, నందకిషోర్, కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్‌రెడ్డి, బుర్ర భూపాల్‌గౌడ్, ప్రశాంత్‌నాయక్, లక్ష్మినారాయణ, బైతి శ్రీధర్, బొక్క బాల్‌రెడ్డి, శ్రీధర్, మైబు, సాబాద విజయ్‌కుమార్, అడికే జనార్దన్, మహేష్‌యాదవ్, భిక్షపతియాదవ్, బీరప్ప, సులిగె వెంకటేష్, సాయియాదవ్, సందీప్ పాల్గొన్నారు.

ఘనంగా హోలీ మిలన్



హోలీ మిలన్‌లో పాల్గొన్న సంఘం సభ్యులు

రాజేంద్రనగర్: అత్తాపూర్‌లోని దేవీసింగ్ ఇంజనీరింగ్ వర్క్‌షాప్‌లో మంగళవారం హోలీ స్నేహ మిలన్ వేడుకలు ఘనంగా జరిగాయి. మహారాణా ప్రతాప్ సేవా సమితి తెలంగాణ ప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గులాల్, పూలతో మిలన్ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు ఠాకూర్ విజయ్ దినేష్ సింగ్, సెక్రటరీ ఠాకూర్ విపిన్‌రాజ్‌సింగ్, రాజ్‌కిషోర్ సింగ్ ఠాకూర్, కోశాధికారి మనోజ్‌దేవీసింగ్, సలహాదారులు అర్జున్ ఠాకూర్, మహిళా విభాగం అధ్యక్షురాలు లీలారాణి ఠాకూర్, ప్రధాన కార్యదర్శి మాయా ఠాకూర్, రాధేకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఆయుష్మాన్ భారత్ కేంద్రంలో పేర్లు నమోదు చేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అత్తాపూర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి సాయియాదవ్, మూసీ ప్రక్షాళన కమిటీ కన్వీనర్ సనివెల్లి జయానంద్‌రెడ్డి అన్నారు. మంగళవారం వారు అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని బీజేపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భారత్ కేంద్రాన్ని సందర్శించి ప్రజలతో పేర్లు నమోదు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కేంద్రాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకానికి డిజిటల్ సేవా కామన్ సర్వీస్ సెంటర్ వారు ఇచ్చే లింక్ ద్వారా ఈ పథకంలో ప్రజల వివరాలు సేకరించి నమోదు చేస్తున్నామన్నారు. 2018 ఫిబ్రవరిలో దేశ వ్యాప్తంగా ప్రారంభమైన ఈ పథకం జనవరి 2023 నుంచి తెలంగాణ రాష్ట్రంలో అమలులోకి వచ్చిందన్నారు. ఇప్పటి వరకు దాదాపు 42 లక్షల మంది ఈ పథకంలో చేరినట్లు తెలిపారు. ప్రతి రోజు 40 నుంచి 50 వేల మంది ప్రజలు ఈ పథకంలో చేరుతున్నారన్నారు. తెల్లరేషన్ కార్డు దారులు మొదటి విడతలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెంకటేష్‌యాదవ్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీలు సంఘటితం కావాలి

శంషాబాద్: బీసీలు సంఘటిత శక్తిగా ఎదగాలని బీసీ జర్నలిస్టు సమాజ్ నేలు అన్నారు. బీసీలు, ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత సాధించే దిశగా బీసీ జర్నలిస్టులు వారిని చైతన్యం చేయాలన్నారు. ఏప్రిల్ 8 నగరంలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించనున్న బీసీ జర్నలిస్టు మహాసభ సన్నాహక సమావేశాన్ని మంగళవారం స్థానిక శ్రీనిక హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు మ్యాడం మధు, సతీష్‌కమాల్, శేఖర్ సాగర్, నాగ పరిమళ మాట్లాడుతూ సంఖ్యాబలం ఉన్నప్పటికీ బీసీలు గ్రామ స్థాయి నుంచి చట్టసభల వరకు కూడా వెళ్లడం లేదన్నారు. ఇందుకు కారణాలను అన్వేషించడంలో జర్నలిస్టులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. రాజకీయ పార్టీలకు ఓటు బ్యాంకుగా మాత్రమే కాకుండా రాజ్యాంగబద్ధంగా బీసీలకు దక్కాల్సిన వాటాలపై కూడా సంస్కరణలు తీసుకొచ్చేలా పోరాడాల్సిన అవసరముందన్నారు. ఏప్రిల్ 8న నిర్వహించనున్న మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టులు బి. మనోహర్, డి.కృష్ణ, డి. రాజు, ఎం. ప్రేమ్‌రాజ్, బాబురావు, చంద్రకాంత్, ఏపీ చారి, సుదర్శన్‌గౌడ్, సూర్యకిరణ్, రాములుగౌడ్, తిరుమలేష్, విజయ్‌కుమార్, లక్ష్మణ్, నరేందర్, గోపాల్, మాధవచారి, చంద్రశేఖర్, అనిల్, శ్రీకాంత్, నగేష్,శివకుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీసీ జర్నలిస్టులు

మహవీర్ ఇంజనీరింగ్ కాలేజీకి అటానమస్ హోదా

రాజేంద్రనగర్: మహవీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలకు వచ్చే అకాడమిక్ సంవత్సరం నుంచి అటానమస్ హోదా లభించినట్లు కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎస్.శర్మ, సిబ్బందితో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల వ్యవస్థాపకులు దివంగత సంరెడ్డి సుదర్శన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పేద, మధ్య తరగతి విద్యార్థులకు చేయూతనందిస్తున్నామన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందిస్తున్న మహవీర్ ఇంజనీరింగ్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి దక్కడం ఎందరో పేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చదిద్దడమే తమ కళాశాల లక్ష్యమన్నారు. సమావేశంలో కళాశాల జాయింట్ సెక్రటరీ ధనుంజయ్‌రెడ్డి, సిబ్బంది డాక్టర్ శంకర్‌రామ్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేస్తున్న సర్పంచు మాధవి

శంషాబాద్ రూరల్: చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. మల్కారం, నర్కూడ జిల్లా పరిషత్ పాఠశాలలో వీటిని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవి, ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వీ, సొసైటీ చైర్మన్ బి.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అడ్వకేట్లు మంగళవారం తమ విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ఘట్‌కేసర్ పోలీసులు న్యాయవాదిపై అక్రమ కేసు బనాయించారని ఆరోపించారు. బాధితుడి పక్షాన స్టేషన్‌కు వెళితే తమ పట్ల అనుచితంగా వ్యవహరించారన్నారు. పోలీసుల వైఖరిని నిరసిస్తూ విధులను బహిష్కరించామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు.

పండగకు ఇంటికొస్తూ..

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం

శంషాబాద్: ఉగాది పండగ కోసం ఇంటికి బయలుదేరిన ఓ ఇంజనీరింగ్ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..కొత్తూరు గ్రామానికి చెందిన జండగూడెం పునీత్(20) గీతం వర్సిటీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. పండగ నేపథ్యంలో ఇంటికి బయలుదేరిన అతను మంగళవారం రాత్రి పట్టణంలోని ఎయిర్‌పోర్టు బ్రిడ్జి వద్ద స్పీడ్ బ్రేకర్‌పై నుంచి బైక్ జంప్ కావడంతో కిందపడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.